క్లుప్తంగా

26, 27 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



నిజామాబాద్ సిటీ: సీపీఎం నిర్మాణ కర్తవ్యాల్లో భాగంగా మూడేళ్లకొకసారి జరిగే పార్టీ మహాసభలు ఈ నెల 26, 27 తేదీలలో నిజామాబాద్ నగరంలో నిర్వహిస్తున్నామని, వాటిని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26న బహిరంగ సభ, అనంతరం పార్టీ ప్రతినిధులతో మహాసభ కొనసాగుతుందని తెలిపారు. 27న సాయంత్రం కొత్త కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. నాయకులు వెంకట్ రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్, గంగాధర్, సుజాత, గంగాధర్, నన్నేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ధర్పల్లి: సీతాయిపేట్ గ్రామానికి చెందిన ఎస్. దేవిదాస్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. సెంట్రల్ యూనివర్సిటీ 24వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ ఛాన్సలర్ ఎల్. నరసింహారెడ్డి చేతుల మీదుగా దేవదాస్ డాక్టరేట్ అందుకున్నారు. 'బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఉపయోగించే వారి వ్యక్తిగత భద్రత' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను సాఫ్ట్‌వేర్ సంస్థలకు, దేశానికి ఉపయోగపడేలా చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. పలువురు దేవిదాస్‌ను అభినందించారు.

సివిల్ సప్లైస్ హమాలీల బస్తా రేట్లు పెంపు



నిజామాబాద్ సిటీ: సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీలు, స్వీపర్లకు వేతనాలు పెరిగాయని, పెరిగిన వేతనాలు త్వరలోనే అమలులోకి వస్తాయని ఏఐటీయూసీ నేత వై ఓమయ్య అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో వై.ఓమయ్య మాట్లాడుతూ.. కూలి రేట్లు క్వింటాకు రూ.26 నుంచి రూ.29 పెంచారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేవేందర్, బాజన్న, పవన్, వెంకటేష్, రాజశేఖర్, బాబర్, యూనిస్, మోహన్, హైమద్ పాల్గొన్నారు.

ఇందల్వాయి యాదవ సంఘం కమిటీ ఎన్నిక

ఇందల్వాయి: ఇందల్వాయి మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్న గంగారాం, ప్రధాన కార్యదర్శిగా బోట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్, యూత్ అధ్యక్షుడిగా గొల్ల భాస్కర్ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మహిపాల్, రూరల్ నియోజకవర్గం కన్వీనర్ గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆవులకు పచ్చిమేత అందజేత

నిజామాబాద్‌నాగారం: లయన్స్ సహారా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం సందర్భంగా రైల్వేస్టేషన్ సమీపంలోని వేంకటేశ్వర మందిరం వద్ద గల గోశాలలోని ఆవులకు పచ్చిమేత అందజేశారు. అధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి ధనుంజయరెడ్డి, జిల్లా కార్యదర్శి ఉదయసూర్యభగవాన్ ఉన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం .. వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. వివరాలు... బొమ్మాళి అరవింద్ స్పెషల్ పార్టీ పోలీస్ కానిస్టేబుల్ పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బందోబస్తు డ్యూటీలో ఉన్నారు. స్టేజ్ పైకి పాస్ లేకుండా మీదకు వెళ్లడానికి ప్రయత్నించిన ఎండీ. హసన్‌ను స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ అనుమతించలేదు. దీంతో ఎండీ హసన్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ కాలర్ పట్టుకొని గుంజాడు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం



ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



వినాయక్‌నగర్‌లో తిలకం దిద్దుతున్న మాజీ మేయర్ ఆకుల సుజాత



డిచ్‌పల్లిలో మహేశ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డిలను సత్కరిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు



సన్మానిస్తున్న సిరికొండ నాయకులు



పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నగర అధ్యక్షుడు కేశ వేణు



సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, వినయ్ రెడ్డి



మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయంలో పూజలు

ఇందల్వాయి/డిచ్‌పల్లి/ఖలీల్‌వాడి/సిరికొండ/నిజామాబాద్ రూరల్: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికై జిల్లాకు తొలిసారి వచ్చిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు దారి పొడవునా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి 50 కార్లతో ఇందల్వాయి టోల్‌ప్లాజాకు చేరుకున్నారు. మహేష్ కుమార్ గౌడ్ రాక సందర్భంగా 44వ నెంబర్ జాతీయ రహదారి చంద్రాయన్‌పల్లి నుంచి మొదలుకొని ఇందల్వాయి, డిచ్‌పల్లి మీదుగా జిల్లా కేంద్రం వరకు రోడ్డుకిరువైపులా పీసీసీ అధ్యక్షుడికి స్వాగతం పలుకుతూ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి బోర్గాం(పి), వినాయక్‌నగర్ హనుమాన్‌చౌరస్తా, పులాంగ్, దేవిటాకీస్, ఎల్లమ్మగుట్ట కమాన్ నుంచి పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడిని భారీ గజామాలలతో సత్కరించారు. ఓపెన్‌టాప్ జీపులో నగరంలోని బోర్గాం(పి) నుంచి పాత కలెక్టరేట్ వరకు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేశారు. కాంగ్రెస్‌నాయకులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. సన్మాన సభకు ఆరుగురు మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు రావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

- గత ప్రభుత్వం ఒక్క ఇల్లు ఇవ్వలేదు
- ప్రస్తుత సర్కారు కూడా ఇందిరమ్మ ఇళ్ల ఊసెత్తడం లేదు
- దీపావళిలోపు అర్బన్‌లో 7500 ఇళ్లు కేటాయించాలి
- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



ధ్వంసమైన ఇంటి కిటికీ

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని నాగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదవారికి వెంటనే కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. శుక్రవారం నాగారంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. సామాన్యునికి సొంత ఇల్లు అనేది ఓ స్వప్నం.. అది సాకారం కావాలని ప్రధాని నరేంద్రమోదీ 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' పథకం ప్రవేశపెట్టి దేశమంతా ఇళ్లు నిర్మించి అర్హులైన పేదలకు ఇస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణకు ఆవాస్ యోజన కింద నిధులు కేటాయిస్తే వాటిని గతంలో పక్కదారి పట్టించారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్బన్ నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇలుల్ ఇవ్వలేదని విమర్శించారు.కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయన్నారు. డోర్లు, కిటికీలు, ఎలక్ట్రిసిటీ పరికరాలు చోరీకి గురయ్యాయన్నారు. ప్రస్తుతం వాటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అన్నారు. గత ఎమ్మెల్యే ముస్లిం ఓటు బ్యాంక్ కోసం 43 శాతం వారికి కేటాయించారని చెప్పారు. రాష్ట్రంలోని రేవంత్ సర్కారు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఒక ఇల్లు కూడా ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మరమ్మతులు చేసి అర్హులైన వారికి దీపావళిలోపు కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్బన్ నియోజకవర్గానికి 7,500 ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం చేయాలన్నారు.

పన్నులు కట్టాలని ఇబ్బంది పెడుతున్నారు



మహేశ్‌కు విన్నవిస్తున్న నాయీబ్రాహ్మణులు

నిజామాబాద్ నాగారం: తెలంగాణ నగర నాయీబ్రాహ్మణ దుకాణదారుల యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అధ్యక్షులు దేశాయి గంగాధర్ మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం కూడా నాయీబ్రాహ్మణ కులవృత్తిపై ఎలాంటి పన్నులు విధించలేదు కానీ ఇప్పుడు మున్సిపల్ అధికారులు వచ్చి మడిగెల కొలతలు తీసుకుంటూ దుకాణం పర్మిషన్ తీసుకోవాలని, పన్నులు కట్టాలని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముత్యాల అంజయ్య, సురేందర్, రామకృష్ణ, తదితరులున్నారు.

జిల్లా కేంద్రానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సిరికొండ: టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలకడానికి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు జిల్లా కేంద్రానికి భారీగా తరలివెళ్లాయి. ప్రత్యేక వాహనాల్లో వందలాది మంది తరలివెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, సొసైటీ చైర్మన్ గంగాధర్, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, దేగాం సాయన్న, నరేందర్, తదితరులు వెళ్లారు.

డీఎస్సీ ఫలితాల ప్రకటన అన్యాయం



మాట్లాడుతున్న మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి, ఇతర నేతలు

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడం అన్యాయమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ జరిగిన తర్వాతనే వివిధ పోస్టుల భర్తీ చేపడతామని హామీ ఇచ్చారు.. కానీ డీఎస్సీ ఫలితాలు విడుదల చేసి పోస్టులను భర్తీ చేస్తున్నారని.. ఇది అన్యాయమని పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 9న జిల్లాలో మాదిగలంతా నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్, జాతీయ నాయకులు గంగాధర్, మైలారం బాలు, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంటలు



సిరికొండ: మండల కేంద్రంతో పాటు న్యావనంది, రావుట్ల, నర్సింగ్‌పల్లి, చిన్నవాల్గోట్ గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి వరి పంట నేలకొరిగింది. దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి తలారి నర్సయ్య శుక్రవారం పరిశీలించారు. పంట నష్టం వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఏఈవో నిఖిల్, రైతులు ఉన్నారు.

వాటర్‌మెన్‌కు అవగాహన



జక్రాన్‌పల్లి: అర్గుల్ మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వాటర్‌మెన్‌కు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఈ గంగారాం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా గ్రామ మంచినీటి సహాయకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు వస్తే వాటర్‌మెన్‌లు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ మోహన్‌రెడ్డి, చైన్‌మెన్‌లు సాయన్న, మధు, గోపి, రాజు, వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశాకార్యకర్తలు

నిజామాబాద్‌నాగారం: ఆశాల సెప్టెంబర్ నెల వేతనం, లెప్రసీ, పల్స్‌పోలియో కార్యక్రమ పెండింగ్ డబ్బులు చెల్లించాలని కోరుతూ శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశాకార్యకర్తలతో కలిసి సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా పండుగలు వస్తున్న నేపథ్యంలో వేతనాలు పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. పారితోషికాలు సకాలంలో రాకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లందరూ తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

కొనసాగుతున్న విధుల బహిష్కరణ



ఖలీల్‌వాడి: హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు న్యాయవాది మహమ్మద్ అబ్దుల్ ఖలీమ్‌పై మాదన్నపేట్ పోలీసుల దాడిని నిరసిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రెండో రోజు విధుల బహిష్కరణ కొనసాగింది. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ నాయకత్వంలో న్యాయవాదులు జిల్లా కోర్టు చౌరస్తాకు చేరుకుని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్ పోయి న్యాయవాదుల ప్రాణాలకు ఎసరు పెట్టే పోలీసింగ్ తయారైందన్నారు. తక్షణమే బాధ్యులైన వారిని ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బార్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి దొన్పాల్ సురేష్, లైబ్రరీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, కోశాధికారి దీపక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు



కోటగల్లి దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



నగరంలోని ఆదర్శనగర్ శ్రీహింగులాంబిక దేవి ఆలయంలో ..

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గామాత మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. అమ్మవారు శుక్రవారం భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చింది. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



బ్రాహ్మణ్‌పల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆర్యనగర్ శ్రీ అభయ వీర హనుమాన్ మందిరంలో..

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏఈ దామోదర్

ధర్పల్లి: గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మిషన్ భగీరథ ఏఈ దామోదర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక వ్యక్తికి మండల స్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో చేతి పంపుల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీలు అరికట్టడం, పంపుసెట్లు, ప్యానెల్ బోర్డుల నిర్వహణ, నీటి నాణ్యత పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. శిక్షణ తరగతులు 4 రోజులపాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఏఈ శివకుమార్, ఇన్‌చార్జి ఎంపీవో భాస్కర్, ట్రైనర్ లియాఖత్ పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల వరకు సోయా కొనుగోలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

సుభాష్‌నగర్/డిచ్‌పల్లి: రైతులు పండించిన సోయాబీన్ పంటను ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లాకు విచ్చేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సోయాబీన్ పంటను ఎకరానికి 6 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ ఉన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న టీజీబీ ఆర్‌ఎం రామారావు

సిరికొండ: తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందిస్తున్న రుణాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు నిర్మల్ రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు తెలిపారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో బ్యాంకు గడ్కోల్ శాఖ ద్వారా అందించిన రుణంతో నూతనంగా ఏర్పాటు చేసిన వీవీ సూపర్ మార్కెట్‌ను ఆర్‌ఎం శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి స్టాండప్ ఇండియా పథకంలో భాగంగా సూపర్ మార్కెట్ కోసం బ్యాంకు ద్వారా రూ.15 లక్షల రుణం మంజూరు చేసినట్లు వెల్లడించారు. బ్యాంకు ద్వారా కార్లకు సెక్యూరిటీ లేకుండా రూ.15 లక్షల వరకు, రైతులకు రెండున్నర ఎకరాల పైన భూమి ఉంటే రైతు నేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఎంవో అభినయ్‌రెడ్డి, హబ్ మేనేజర్ సురేందర్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ యాదగిరిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,500	వెండి (కిలో)	96,000
22 క్యారెట్స్	72,427		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	50	80
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	40	60	దోసకాయ	40	60
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బిర్నీసుకాయ	50	80	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	80	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	45	75
పాలకూర	50	90	కరివేపాకు	50	75
మెంతికూర	60	100	చామగడ్డ	50	75
కొత్తిమీర	60	90	గోరుచిక్కుడు	40	60
పుదీనా	60	90	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 (తెలుగు)-9.10 12.20 3.40 7.00 10.20
స్క్రీన్-2	దేవర పార్ట్-1 (తెలుగు)- 10.30 చిట్టి పొట్టి(తెలుగు)-7.30 సత్యం సుందరం(తెలుగు)- 10.10
స్క్రీన్-3	సత్యం సుందరం(తెలుగు)- 12.35 4.00 7.20 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1(తెలుగు)- 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-3	మత్తువదలరా-02(తెలుగు)-12.30 3.00 6.00 9.00
స్క్రీన్-4	సత్యం సుందరం (తెలుగు) - 11.00 2.40 6.20 10.00
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	సత్యం సుందరం (తెలుగు)
నటరాజ్	దేవర పార్ట్-1(తెలుగు)
విజయ్	దేవర పార్ట్-1(తెలుగు)